కథ

# కొందరికి దూరం కావాలి

-భమిడి వెంకటేశ్వర్లు

**దమయంతి** ఎక్కడికో బయలుదేరుతున్నట్లుగా గ్రహించాడు శ్రీరావు. ఎక్కడికో అర్థం కాలేదు. అడిగితే లాభం లేదనుకున్నాడు. పదినిమిషాల నుంచి ఎదురు చూస్తున్నాడు తను. దమయంతి మాత్రం బెడ్‌రూం నుండి బయటపడలేదు. అందుకే తను ఆమె దగ్గర కెళ్ళాడు.

"ఏమిటి విశేషం ? ఎక్కడికి ప్రయాణం ?" అడిగాడు శ్రీరావు భార్య వైపే చూస్తూ.

"పేరంటానికి" అంది దమయంతి.

"ఇప్పుడా ... ఆరుగంటలకేనా"

వాళ్ళున్నంతకాలం వారిని అత్తగారిలా అన్ని విషయాల్లోనూ సాధిస్తూనే వుండేది ఆవిడ. నాలుగైదు సార్లు ఖాళీ చేసి వెళ్ళిపోదామనుకున్నారు.

"అవును ... తులశమ్మ ఎక్కడికో వెడుతుందట. అందుకే యీలోగా వెళ్ళొచ్చేస్తే మంచిదని" అంది దమయంతి.

"ఇంతకీ పేరంటం ఎక్కడ ... ఎవరు వాళ్ళు?" అడిగాడు శ్రీరావు ఏదో గుర్తుకొచ్చినట్లుగా.

"డి.సి. గారింట్లో. వాళ్ళ మనవడి బర్త్‌డే పార్టీ... అందుకని ......"

"అంటే తులశమ్మ వెనకే నువ్వు వెడుతున్నావన్నమాట" "శ్రీరావుకి కోపం రాకపోలేదు. నిజానికి తను అందామనుకున్న విషయం "తులశమ్మ చుట్టాలు కదా వాళ్ళు. నీకు వారితో అంత పరిచయం లేదుగా ... పైగా నువ్వు తులశమ్మ యింట్లో వున్నప్పుడు ఎదురుగా వున్నావు కాబట్టి తులశమ్మతో పాటు నిన్ను పిలిచించి డి.సి. గారి భార్య. అంత మాత్రం చేత నువ్వు వెళ్ళక్కర్లేదు" అని.

"నిజమేమరి ... కాని తులశమ్మ రమ్మంది కదా" దమయంతి చెప్పింది.

"ఆవిడ రమ్మంటే వెళ్ళిపోడమేనా .... నువ్వు రమ్మన్న చోటుకి ఆవిడ వస్తోందా ..... అంతెందుకు గోపాలరావు యింటి గృహప్రవేశంకు వెళ్లారా ఆ దంపతులు !" అంటూ గుర్తు చేసాడు శ్రీరావు.

దమయంతి జవాబు చెప్పదు, చెప్పలేదు. అది ఆమె బలహీనత అని శ్రీరావుకి తెలుసు.

గోపాలరావు దంపతులు తులశమ్మ యింట్లో అయిదేళ్ళున్నారు. వాళ్ళున్నంతకాలం వారిని అత్తగారిలా అన్ని విషయాల్లోనూ సాధిస్తూనే వుండేది ఆవిడ. నాలుగైదు సార్లు ఖాళీ చేసి వెళ్ళిపోదామనుకున్నారు. కాని ఎలాగో సర్దుకుపోయేవారు. ఇదంతా శ్రీరావుకి చెప్పేవాడు గోపాలరావు. ఒకసారైతే, శ్రీరావు యింట్లో ఓ వాటా కాళీ అయింది. "సార్ .... మీ యింటికి మారుతాను" అన్నాడు గోపాలరావు.

శ్రీరావు అన్నాడు "ఇవ్వడానికి అభ్యంతరం లేదు. కాని రేపెప్పుడో మీరు మరో ఇంటికి వెళ్ళిపోతే నా స్థితి ఏమిటి ? నేను, తులశమ్మ పర్మినెంటుగా ముఖాలు చూసుకుంటూ వుండగలమా ? అయినా మీకు తెలియంది ఏముంది" అని.

అలా గోపాలరావుకి యిల్లు యివ్వలేకపోయాడు శ్రీరావు తులశమ్మ మెంటాలిటీ తెలుసు కాబట్టి.

అటువంటి సమయంలో గోపాలరావు సఫిల్‌గూడాలో ప్లాటు కొన్నాడు. గృహప్రవేశానికి తులశమ్మ దంపతులను ఆహ్వానించాడు. తప్పకుండా రావలసిందని రెండుసార్లు ఫోను కూడా చేసాడు అతను. శ్రీరావుని కూడా ఆహ్వానించాడు.

గృహప్రవేశం రోజున శ్రీరావు తులశమ్మ యింటికెళ్ళి అడిగాడు "వస్తున్నారా" అని.

"ఎక్కడికి" అని పోజు పెట్టింది ఆవిడ.

శ్రీరావు గుర్తు చేసాడు.

"పోనిద్దురూ, ఏం వెడతాం ! పైగా సాయంత్రం మా వాళ్ళు వస్తారు. అయినా సఫిల్ గూడా వెళ్ళటం మాటలా..... మీరు వెడుతున్నారా ?'' తులశమ్మతీగ లాగినంతగా అంది.

"పాపం గోపాలరావు గారు అంత దూరం నుండి వచ్చి పిలిచాడు కదా. పైగా మొన్నోసారి ఫోను కూడా చేసాడు" అన్నాడు శ్రీరావు.

మొత్తానికి తులశమ్మ దంపతులు ఆ కార్యక్రమానికి వెళ్ళలేదు. శ్రీరావు దంపతులు వెళ్ళారు.

ఆ సాయంత్రం గాని, మర్నాడు గాని, తరువాత కాని గోపాలరావు కొన్న ఫ్లాటు గురించి అడగలేదు తులశమ్మ. ఆవిడ అడగదని శ్రీరావుకి తెలుసు.

తులశమ్మకు బోలెడు ఆస్తి వుంది. బ్యాంకు బాలెన్సులున్నాయి. పదివేల దాకా అద్దెలొస్తాయి. పట్టుచీరలు, నగలు సరేసరి. పైగా ఒక్కడే కొడుకు. అతను అమెరికాలో వున్నాడు. ఇన్ని ప్లసు పాయింట్సు వుంటే ఎవరినైనా ఆవిడ ఎందుకు అభిమానిస్తుంది ... ఆలోచిస్తుంది?

మొత్తానికి దమయంతి, దర్జాగా తయారు కాకపోయినా, ఓ మోస్తరు అలంకరణకే ఆమె తులశమ్మను మించినట్లుగా వుంటుంది. ఆ అసూయ కూడా తులశమ్మలో లేకపోలేదు.

తులశమ్మ మేడదిగి వచ్చింది. అంతవరకూ దమయంతి గేటుదగ్గరే కాపలా కాసింది. అప్పటికే అన్నాడు శ్రీరావు "ఆవిడ బయటకు వచ్చాక వెడుదువుకాని .... లోపలికి వచ్చి కూర్చో ... ఆవిడ కోసం ఎదురు సన్నాహం ఏమిటి ... '' అని.

భర్త ధోరణి తెలుసు కాబట్టి ఆమె పట్టించుకోలేదు. మొత్తానికి యిద్దరూ డి.సి. గారింటికి బయలుదేరారు. శ్రీరావు లోపలకొచ్చేసి టి.వి. ఆన్‌చేసి సీరియస్‌గా చూస్తున్నాడు.

> "పరిచయం లేని వాళ్ళిళ్లకు వెళ్లకూడదట, ఏదో ఎదురుగా కనిపిస్తే పిలుస్తారుట ... అంత మాత్రాన వెళ్లాల్సిన అవసరం వుండదుట" అంది.

సరిగ్గా పది నిమిషాల తర్వాత వచ్చేసింది దమయంతి. తిన్నగా ఆమె బెడ్‌రూం లోకి వెళ్ళి వాలిపోయింది. శ్రీరావుకి అర్థం కాలేదు. అతను రూం లోకి వెళ్ళాడు.

"ఏమైంది ... అప్పుడే వచ్చేసేవేమిటి" అని అడిగాడు శ్రీరావు.

భోరుమని ఏడవసాగింది దమయంతి. "చెప్పు, ఏం జరిగిందో" అడిగాడు శ్రీరావు మళ్ళీ.

"పరిచయం లేని వాళ్ళిళ్లకు వెళ్ళకూడదట, ఏదో ఎదురుగా కనిపిస్తే పిలుస్తారుట ... అంత మాత్రాన వెళ్ళాల్సిన అవసరం వుండదుటి" అంది ..... తులశమ్మ కబుర్ల మధ్య. ముందు నాకు అర్థం కాలేదు. తరువాత లైటు వెలిగింది అంది దిగులుగా.

శ్రీరావు భార్యని బుజ్జగించాడు. "టేకిట్‌ఈజీ .... మనుషులని బట్టి, సందర్భాలను బట్టి మనం నిర్ణయాలు తీసుకోవాలి" అంటూ.

ఒక నెల తర్వాత గోపాలరావు శ్రీరావుకి ఫోను చేసాడు "మీరిద్దరూ మాయింటికి భోజనంకు రావాలి తప్పకుండా" అంటూ కారణం చెప్పాడు.

"శుభం ... గుడ్‌లక్ ..." అన్నాడు శ్రీరావు.

ఆరోజు పదిగంటలకు శ్రీరావు, దమయంతి గోపాలరావు యింటికి బయలుదేరుతుంటే తులశమ్మ గేటు దగ్గరికి వచ్చి "ఎక్కడికి బయలు దేరారు పొద్దున్నే ?" అని అడిగింది.

"గోపాలరావు గారింటికి. వాళ్ళింట్లో గెట్ టు గెదర్ పార్టీ అరేంజి చేసారు" అంది దమయంతి.

ఆశ్చర్యపోయింది తులశమ్మ. "ఏమిటి విశేషం ?" అంటూ వెంటనే అడిగింది.

శ్రీరావు దమయంతి వైపు చూసాడు ..... "చెప్పొద్దు" అన్నట్లుగా. మళ్ళీ అడిగిందావిడ.

"వాళ్ళబ్బాయికి ఉద్యోగం వచ్చిందట ..." అంటూ చెప్తుంటే ఆవిడ ముఖంలో రంగులు మారసాగాయి. ఆవిడ ఆలోచనలు ఎక్కడో వున్నట్టు గ్రహించాడు శ్రీరావు.

"గోపాలరావు దంపతులకు విశ్వాసం లేదండీ ... మా యింట్లో వుండి, మమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోయాడు. కనీసం భోజనంకు పిలవలేదు. ఇలా వుంటారు మనుషులు. మా ఇంటికోసం నాలుగైదు సార్లు తిరిగాడు, పోనీలే అని యిచ్చాం" అంది ఆవిడ యీసడింపుగా.

"మీరు వస్తారో రారో అని అయివుంటుంది. పైగా సఫిల్‌గూడా దూరం కదా ... మీ ఇంటికి డి.సి. గారి లాటి వారు ఎవరైనా వస్తారని చెప్పలేదేమో ... లేకపోతే మరిచిపోయి వుంటాడు" చెబుతున్నాడు శ్రీరావు వరుసగా.

ఇప్పుడు తులశమ్మ ముఖంలో రంగులు పూర్తిగా వెలిసిపోయినట్లు కనిపిస్తున్నాయి.


"రేపు వాళ్ళబ్బాయి ఉద్యోగ నిమిత్తం అమెరికా వెళ్ళిపోతున్నాడు. అందుకే యీ వేళ గెట్ టు గెదర్" అని చెప్పి స్కూటరు స్టార్టు చేసాడు శ్రీరావు.

ఎదుటి వాడి ఉన్నతిని ఓర్వలేని వాళ్ళు, సంతోషించ లేని వాళ్ళు ఎందుకిలా ప్రవర్తిస్తారో అని శ్రీరావు, దమయంతిలు ఆలోచిస్తుంటారు తరచు. గోపాలరావు కొడుకు అమెరికా ఉద్యోగం తులశమ్మను కలవర పెడుతోంది.

***

కవిత

# కులం



గాలి దే కులం
నీటి దే కులం
నిప్పు దే కులం
నింగి దే కులం
నేల దే కులం
జంతు జాలాల దే కులం
పశు పక్ష్యాదుల దే కులం
మాను దే కులం
మనిషి దే కులం
కులం పేరుతో మనిషే విఫలం
రాజకీయ కుల కార్చిచ్చు అధోపతనం
విడనాడు కులకుతంత్రాల ......
మట్టి గోడలు .......... అందరూ సమానం
నాడే పురోగమనానకి ..........
.......... మార్గం సుగమం

- శ్యామ్ విజయ్